క్లుప్తంగా...

'గణేష్ ఉత్సవాలకు హైదరాబాద్ పెట్టింది పేరు'



గోల్కొండ: గణేష్ ఉత్సవాలకు హైదరాబాద్ నగరానికి పెట్టింది పేరని గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ భగవంత్‌రావు అన్నారు. మంగళవారం బీజేపీ నాయకులు ఆయనను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడు లేని విధంగా ఈఏడాది భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. శ్రీకాంత్, దయానంద్, సుధీర్‌యాదవ్ తదితరులున్నారు.

సన్మానం



చాంద్రాయణగుట్ట: సివిల్ ఎస్సైగా ఉద్యోగం సాధించిన ఉప్పుగూడ శివాజీనగర్‌కు చెందిన యువకుడిని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సన్మానించారు. రత్రావత్ శంకర్ నాయక్, కమలమ్మల కుమారుడు శ్రీకాంత్ నాయక్ ఎస్సైగా ఉద్యోగం సాధించాడాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ ఉప్పుగూడ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మల్లేష్ యాదవ్, బ్రహ్మాచారి, సాయిలు, రామచంద్రం, రవి ముదిరాజ్, శ్రీరాములు, అనంత స్వామి యువకుడిని సన్మానించి అభినందనలు తెలియజేశారు.

షాహినాయత్‌గంజ్ క్రైం ఇన్‌స్పెక్టర్‌గా శోభన్‌బాబు



అబిడ్స్: షాహినాయత్ గంజ్ క్రైం ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్. శోభన్‌బాబు పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన శోభన్‌బాబు గతంలో కీసర, వనస్థలిపురం, దిండిగల్లు, హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల అదుపునకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. నూతనంగా నియమితులైన శోభన్‌బాబును ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్ శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ డీలర్ల కమీషన్ పెంచడంపై హర్షం

దూద్‌బౌలి: తెలంగాణ రేషన్ డీలర్ల కమీషన్ పెంచడంపై హైదరాబాద్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుస్తె శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, గంగుల కమలాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 17,227 మంది రేషన్ డీలర్లకు కమీషన్ పెంచడంతో కరోనాలో చనిపోయిన 100 మంది కుటుంబసభ్యులకు రేషన్ డీలర్‌షిప్‌ను కేటాయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీ ఎదురుగా అమరవీరుల స్మారక స్థూపం వద్ద 9 సర్కిళ్ల రేషన్ డీలర్లతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయనున్నట్లు తెలిపారు.


అసెంబ్లీలో స్లాటర్‌హౌస్‌పై ప్రస్తావన హర్షం



ఎమ్మెల్యే కౌసర్‌ను కలిసిన నర్సింగ్‌రావు, శశికాంత్ రావు

జియాగూడ: అసెంబ్లీలో జియాగూడ స్లాటర్ హౌస్ నిర్మాణం చేపట్టాలని ప్రస్తావనను చేసిన మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌కు జియాగూడ ఆరె కటిక సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు, చర్మకళ్ సంఘం అధ్యక్షుడు శశికాంత్‌రావు, ప్రధాన కార్యదర్శి దర్శిన్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే కౌసర్, బలాలలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ..జియాగూడ స్లాటర్‌హౌస్‌పై అన్ని వర్గాల వారు ఉపాధి పొందుతున్నారన్నారు. హరికిషన్, నరేష్ పాల్గొన్నారు.

నాంపల్లి తహసీల్దార్‌గా ప్రేమ్‌కుమార్



అబిడ్స్: నాంపల్లి తహసీల్దార్‌గా మన్నె ప్రేమ్ కుమార్ పదవీబాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసి ఎంపీపీ ప్రసాద్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ బదిలీపై వచ్చారు. గతంలో గ్రేటర్ పరిధిలోని ఉప్పల్, చార్మినార్ మండలాలతో పాటు రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు మండలాల్లో మన్నె ప్రేమ్‌కుమార్ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జాలు కాకుండా కాపాడేందుకు కృషి చేస్తానన్నారు.

సహజత్వం కోల్పోతున్న గ్రానైట్ రోడ్లు

- చార్మినార్ కాలిబాట పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రానైట్ రోడ్లు
- గుల్జార్‌హౌస్–మక్కా మసీదు–ట్రాఫిక్ పీఎస్ రోడ్డులో..
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది
- వ్యాపారులకు అవగాహన కల్పించాలంటున్న పర్యాటకులు



చార్మినార్ వద్ద..

చార్మినార్: చార్మినార్ కట్టడం నలువైపులా ఏర్పాటు చేసిన గ్రానైట్ రోడ్డు సహజత్వాన్ని కోల్పోతోంది. గతంలో కాలిబాట పథకం పనుల్లో భాగంగా చార్మినార్ కట్టడం చుట్టూ ఏర్పాటు చేసిన గ్రానైట్ రోడ్డులో అడ్డగోలుగా హోటల్ వ్యర్థాలను పారబోస్తుండడంతో గ్రానైట్ రాళ్లు సహజత్వం కోల్పోతున్నాయి. అంతేకాకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో అందవికారంగా కనిపిస్తున్నాయి. చార్మినార్‌తో పాటు మక్కా మసీదు రోడ్డులో ఏర్పాటు చేసిన హోటళ్లు, తినుబండారాల అడ్డాలు, టిఫిన్ బండ్లు, జ్యూస్ సెంటర్‌లతో నిత్యం రద్దీగా ఉంటాయి. వినియోగదారులకు అవసరమైన ఆహార పదార్థాలను అందించిన అనంతరం కొంత మంది ఓపిక లేకనో.. సమయం లేకనో తమ హోటళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను అక్కడే వేస్తుండడంతో గ్రానైట్ రోడ్డు మురికి కూపంగా కనిపిస్తున్నాయి.

పట్టించుకునే వారే లేరు..

చార్మినార్, మక్కా మసీదుల వద్ద ఇలా దుర్భరంగా కనిపిస్తున్న వాటిని పట్టించుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు. హోటళ్ల వద్ద టీ తాగిన అనంతరం పాన్ తిని గ్రానైట్ రాళ్లపై ఉమ్మివేస్తున్నారని.. దీంతో జుగుప్సాకరరంగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పిటూన్ బాక్స్(ఉమ్మివేసే డబ్బాలు) లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయంటున్నారు. స్థానిక హోటళ్లు, చిరు బండారాల విక్రయదారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందంటున్నారు. గ్రానైట్ రోడ్లపై చెత్తా చెదారాన్ని వేస్తే పెద్ద ఎత్తున చలాన్లు విధిస్తామనే విషయాన్ని వారికి వివరించాల్సిన అవసరం ఉందంటున్నారు. ఐదారేళ్ల క్రితం ఈ విషయంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన అధికారులు, సిబ్బంది ఆ తర్వాత పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి.

నిరంతర పర్యవేక్షణ అవసరం..

ప్రపంచ పర్యాటక ప్రాంతమైన చార్మినార్ కట్టడం వద్ద సంబంధిత అధికారుల నిరంతర పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి. కోట్లాది రూపాలయలను ఖర్చు చేసి చార్మినార్ కట్టడం చుట్టూ చేపట్టిన చార్మినార్ పెడస్ట్రనైజేషన్ జోన్ ప్రాజెక్ట్ పనులకు అర్థం లేకుండా పోతోంది. ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి పూర్తి చేసిన పనులను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. తూతూ మంత్రంగా నిర్వహించే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు ఆశించిన ఫలితాలు సాధించవు. ఎన్ని సార్లు చెప్పిన వినడం లేదని కుంటి సాకులు చెప్పే సంబంధిత అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. పెద్ద మొత్తంలో చలాన్లు విధిస్తూ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తే ఆశించిన ఫలితాలుంటాయని పర్యాటకులు అంటున్నారు.

అవగాహన కల్పించి చలాన్లు వేస్తాం..



చార్మినార్ కాలిబాట పథకంలో భాగంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన గ్రానైట్ రోడ్ల సహజత్వం కోల్పోకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటాం. వ్యాపారులకు అవగాహన కల్పిస్తాం. అవసరమైతే.. వినకపోతే.. చలాన్లు సైతం విధిస్తాం.

– వెంకన్న, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్

గోషామహల్‌లో బండి సంజయ్ పోటీచేస్తే చిత్తుగా ఓడిస్తాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ పోటీ చేస్తే బీఆర్ఎస్ పార్టీ చిత్తుగా ఓడిస్తుందని నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ అభివృద్ధి, ప్రగతి, సంక్షేమంతో నియోజకవర్గ ప్రజలంతా బీఆర్ఎస్ వైపే మొగ్గుచూపుతున్నారన్నారు. మంగళవారం గోషామహల్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నందికిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. బండి సంజయ్ చేసిన ప్రకటనతో ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. మంత్రి కేటీఆర్ గోషామహల్ నుంచి బరిలోకి దిగితే రాజాసింగ్ ఓడిస్తారని బండి సంజయ్ పేర్కొనడం ఆయన అవివేకమన్నారు. మంత్రి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి బండి సంజయ్‌కు లేదన్నారు. రాజాసింగ్ కానీ, బండి సంజయ్ కానీ ఇతర ఏ బీజేపీ నాయకుడు బరిలో దిగినా తమ కార్యకర్తలు, నాయకులంతా ఏకమై బీజేపీని చిత్తుగా ఓడిస్తామన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలోనే కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు మంత్రి తలసాని సహకారంతో చేపట్టామన్నారు. బీజేపీతో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, శీలం సరస్వతి, జయశంకర్, అనిత, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి మజ్లిస్ పార్టీ కృషి



అధికారులతో కలిసి పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్

దూద్‌బౌలి: ప్రజా సమస్యల పరిష్కారానికి మజ్లిస్ పార్టీ కృషి చేస్తుందని ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ ఖాద్రీ అన్నారు. మంగళవారం హైదరాబాద్ పార్లమెంటు సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు చార్మినార్ నియోజకవర్గంలోని ఫతేదర్వాజా ప్రాంతంలో పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్, జలమండలి డీజీఎం హకీం, జీఎం, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో మజ్లిస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. పురానాపూల్ కార్పొరేటర్ రాజ్‌మోహన్ మాట్లాడుతూ.. చార్మినార్ నియోజకవర్గంలోని పురానాపూల్ డివిజన్‌లో ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు హఫీజ్ అత్తర్ అలీ, సిద్దిఖీ, హఫీజ్ షఫి మోహీనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి



మంత్రి తలసానిని కలిసిన ఆల పురుషోత్తమ్ రావు, హనుమాన్‌దాగ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు ఆధ్వర్యంలో జ్ఞాన్‌బాగ్ కాలనీ ప్రెసిడెంట్ హనుమాన్‌దాగ, మోహన్ ముందాడా మంత్రి తలసాని కలిశారు. జ్ఞాన్‌బాగ్ కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణం, నియోజకవర్గంలో ఉన్న ఇతర పలు అభివృద్ధి పనులపై మంత్రికి ఆల పురుషోత్తమ్‌రావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ... నియోజకవర్గం నలుమూలలా గతంలో కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేశామన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే గోషామహల్ ప్రాంతంలో అభివృద్ధి జరిగిందన్నారు. జ్ఞాన్‌బాగ్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు ఇతర పలు అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని అధికారులను మంత్రి తలసాని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీలో చేరికలు



చార్మినార్: వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు గట్టి పోటీనిస్తూ ఆశించిన ఫలితాలు సాధించనున్నారని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ హమీద్ హుస్సేన్ సుత్తారీ అన్నారు. మంగళవారం పాతబస్తీ మొగల్‌పురాలోని పార్టీ కార్యాలయంలో కామారెడ్డికి చెందిన 50 మంది యువకులు ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీలో చేరినట్లు వెల్లడించారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించామన్నారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కాస సోమయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.కవి అబ్బాస్, మహ్మద్ వాహెద్ అలీ, కౌసర్ అలీ మీర్జా, అబ్దుల్ మజీద్ అత్తర్, సయ్యద్ అల్తాఫ్ ఉద్దీన్, షేక్ సిద్దిక్ పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో అభివృద్ధి పనులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. మంగళవారం ఆయన జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌తో కలిసి డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ సాంకేతిక సిబ్బంది ప్రతినిత్యం బస్తీల్లో పర్యటిస్తున్నాయని అన్నారు. అవసరమైన చోట వెంటనే మరమ్మతులు నిర్వహిస్తున్నారన్నారు. భారీ వర్షాలకు ఎన్నో డ్రైనేజీ పైపులు పగిలాయని వాటిని మార్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, పవన్‌సింగ్, అశ్విన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ

ఉత్సాహంగా రెడ్ కలర్స్ డే



వేడుకల్లో రిలయన్స్ హైటెక్ స్కూల్ చైర్మన్ జితేందర్ సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

అబిడ్స్: విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా వారిని ఆయా రంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు రిలయన్స్ హైటెక్ స్కూల్ చైర్మన్ జితేందర్ సింగ్ పేర్కొన్నారు. ధూల్‌పేట శివలాల్‌నగర్‌లోని స్కూల్ ఆవరణలో విద్యార్థులకు రెడ్ కలర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు భారతీయ సంస్కృతిని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

మజ్లిస్ సెక్యులర్ పార్టీ: ఎమ్మెల్యే కౌసర్



స్థానికుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ పక్కా సెక్యులర్ పార్టీ అని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఉదయం కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల వారు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఆయనకు వివరించుకున్నారు. తాగునీటి కొరత తీవ్రంగా ఉందని ఎండీ లైన్స్‌కు చెందిన పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. తమ ప్రాంతంలో రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుందని మరికొందరు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొన్ని సమస్యలు సీజన్‌లో తలెత్తుతాయని వాటిలో డ్రైనేజీలు పొంగిపొర్లడం ఒకటని ఆయన అన్నారు. భారీగా కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లిన మాట వాస్తవమేనని అయితే జలమండలి అధికారులను వెంటనే రంగంలోకి దించి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. లో ప్రెజర్ ఉన్న సమస్యల ప్రాంతాల్లో బూస్టర్లు బిగించి తాగునీటి సమస్య లేకుండా చూస్తున్నానని ఆయన అన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని శృతిలయ ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపకురాలు ఆమని అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతున్న దామోదర్‌రెడ్డి దంపతులకు తన 10వ తరగతి స్నేహితులతో కలిసి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణమూర్తి, గంగాధర్, వనజ, సురేష్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షకులకు రాఖీ



రాఖీలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ నేతృత్వంలో కళాశాల మహిళా సాధికారిత విభాగం, సంస్కృతి ఫౌండేషన్ వారికి మన దేశ రక్షణకై పాటుపడుతూ సరిహద్దుల్లో పని చేస్తున్న సైనికులకు సంఘీభావాన్ని, సోదరభావాన్ని తెలియజేస్తూ రాఖీలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ మాట్లాడుతూ... ప్రాణాలను సైతం లెక్క చేయక ఆహర్నిషలు దేశ రక్షణకై పాటు పడుతున్న సైనికులే నిజమైన సోదరులన్నారు. మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ డాక్టర్ పి.శ్రీదేవి విద్యార్థుల కృషిని ప్రశంసించారు. సంస్కృతి ఫౌండేషన్ విభాగం కార్యదర్శి అజయ్, తుకారాంలు రాఖీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విభాగం సభ్యులు డాక్టర్ నర్మద, డాక్టర్ వేదవతి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ చిత్తరంజన్, డాక్టర్ సుదక్షణలు, డాక్టర్ శంకర్, సుజాత తదితర అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తుంది'

గౌలిపురా: గృహలక్ష్మి పథకం దరఖాస్తులకు మూడు రోజులు మాత్రమే గడువు ఉందని సోషల్ మీడియాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోస్టులు పెట్టారని... రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మరోక్కసారి తప్పుదోవ పట్టిస్తుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సుమన్‌కుమార్ ముదిరాజ్ అన్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలో కూడా గృహలక్ష్మి పథకానికి సంబంధించిన సరైన గైడెన్స్ లేవని అధికారులు చెబుతున్నారన్నారు. మున్సిపల్ జీహెచ్‌ఎంసీ అధికారులు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరుగుతున్నా వారికి సరైన సమాధానం దొరకడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పట్ల కపట ప్రేమను మానుకొని గృహలక్ష్మి పథకానికి సంబంధించిన సరైన గైడెన్స్ త్వరగా విడుదల చేసి సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

'ఓటరు నమోదు'ను సద్వినియోగం చేసుకోండి

చార్మినార్: ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ డీడీ నాయక్ కోరారు. ఇటీవల కొత్తగా డీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ.. బస్తీలు, కాలనీల వారీగా తాము అవగాహన కార్య క్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి వార్డులో ఈ కార్యక్రమాలను ప్రారంభించామన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోలేని వారు కొత్తగా నమోదు చేసుకోవాని.. అలాగే మార్పులు, చేర్పులు, తొలగింపుతో పాటు ఈవీఎంలపై అవగాహన తదితర వాటన్నింటిని ఈ స్పెషల్ డ్రైవ్‌లో నిర్వహిస్తున్నామన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న మీర్‌చౌక్ ఏసీపీ ఎన్.ఎస్.వి.వెంకటేశ్వర్‌రావు

గౌలిపురా: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీ ఎన్.ఎస్.వి.వెంకటేశ్వర్ రావు సూచించారు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎం. రవీందర్ ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతి భద్రతల విషయంలో ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలతో మమేకమై శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌడీషీటర్లు పదే పదే నేరాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లు తమ సత్ప్రవర్తినతో మెలిగితే రౌడీషీట్‌ను ఎత్తివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నరేందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భీమా, వైస్ ప్రిన్సిపల్ ఉపేందర్ రెడ్డి కో ఆర్డినేటర్ ఎస్.రేణుకా, ప్రజా సంబాధాల అధికారి పరందాములు పాల్గొన్నారు.

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని అవినీతి నిరోధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.చేతన అన్నారు. మంగళవారం నిజాం కళాశాలలో వివిధ డిగ్రీ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు స్వాగత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కలలు కనడానికి ఎలాంటి సరిహద్దులు లేవని, అయితే అవి ఉత్తమంగా, ఉన్నతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ జి.మల్లేశం,

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శివచంద్ర

సంతోష్‌నగర్: స్టేషన్ పరిధిలోని ప్రజలతో మమేకమైశాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తున్నామని సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శివచంద్ర అన్నారు. స్టేషన్ పరిధిలోని సాయిబాబానగర్, రాజీవ్‌నగర్ బస్తీ ప్రజలతో కలిసి సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతి భద్రతల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. స్టేషన్ పరిధిలోని ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీలు, ఆపరేషన్ ఛబుత్రా, ప్రధాన కూడళ్లల్లో గస్తీలను ఏర్పాటు చేసి బందోబస్తును పర్యవేక్షిస్తున్నామన్నారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ శివచంద్రను బస్తీవాసులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నర్సింగ్ రావు, సిబ్బంది బస్తీవాసులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమాలోని కాళిమాత– కట్టమైసమ్మ–ఎల్లమ్మ ఆలయ కమిటీకి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. శ్రీకృష్ణ బాల భక్త సమాజం ఉమ్మడి ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో ఆలయ శాశ్వత పూజారీగా బొల్లు జగన్, అధ్యక్షుడిగా నానావల ప్రమోద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అంకర్ల పాపయ్య, కోశాధికారిగా కడమంచి నర్సింగ్ రావు, చీఫ్ అడ్వయిజర్‌గా ఎస్.బూసిరెడ్డి, సలహాదారులుగా వై.విజయ్‌కుమార్, గోవర్ధన్‌గౌడ్, కె.వసంత్ కుమార్, టి.అశోక్ కుమార్ ఎన్నికయ్యారు. కమిటీ ఆధ్వర్యంలో కలిసి కట్టుగా అన్ని రకాల ఉత్సవాలను వైభవంగా కొనసాగిస్తామన్నారు.